జిల్లాలో పశుగణన షురూ

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా పశుగణన నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. జాతీయ పశుగణన సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం సూర్యాపేటలో ఆయన గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకోసారి పశువులను లెక్కిస్తారని, జిల్లాలో శుక్రవారం మొదలైన పశుగణన ఫిబ్రవరి 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని జాతుల వారీగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ వెంకన్న, పెంటయ్య, పశు సంవర్ధక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సూర్యాపేట: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చింతలపాలేనికి ట్యాంకర్లతో మిషన్ భగీరథ నీటి సరఫరా

చింతలపాలెం (మేళ్లచెరువు), న్యూస్‌టుడే: చింతలపాలెంలో అతిసార వ్యాధితో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటనను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై పత్రికల్లో వార్తలు రావడంతో పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులతో గూగుల్‌మీట్‌లో శుక్రవారం చర్చించారు. వెంటనే క్షేత్ర స్థాయి పరిశీలనకెళ్లాలని ఆదేశించారు. సమస్య ఉత్పన్నానికి కారణాలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీఎంహెచ్‌వో కోటాచలం, డీపీవో నారాయణరెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా డీఈలు చింతలపాలెన్ని సందర్శించారు. బోర్లు, వాటర్ ట్యాంకులు, పైపులైన్లను పరిశీలించారు. వాటి వద్ద నీటి నమూనాలను సేకరించారు. అతిసార వ్యాధి మరింత వ్యాప్తి కాకుండా ఉండాలంటే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడమొక్కటే మార్గమని నిర్ణయించారు. ట్యాంకర్ల ద్వారా గుడిమల్కాపురం నుంచి సాయంత్రం మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు.

వంటపాత్రలు వచ్చేస్తున్నాయ్..!

రాజాపేట, భువనగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఇందుకు స్థానికంగా మహిళా సంఘం సభ్యులను నియమించడమే కాకుండా వారికి గౌరవ భృతి సైతం అందిస్తోంది. అప్పట్లో దశల వారీగా వంటగదులను సైతం నిర్మించారు. అంతా బాగానే ఉన్నా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించినప్పుడు అందించిన వంటపాత్రలతోనే ఏజెన్సీలు ఇప్పటి వరకు వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన పాత్రలతో వంటలు రుచికరంగా ఉండకపోవడంతో పాటు ఇబ్బందులు పడుతున్నామని వంట ఏజెన్సీ మహిళలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. వంట ఏజెన్సీల డిమాండ్ నేపథ్యంలో ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తాజాగా వంటపాత్రల కొనుగోళ్లకు నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆయా పాఠశాలల్లో పథకం నిర్వహణకు వంటపాత్రలకు ప్రభుత్వం రూ.2.60 కోట్లు వెచ్చించింది.


రాజాపేటలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ (పాతచిత్రం)

అందించనున్న పాత్రలు ఇవీ..

తెల్ల అన్నం వండే గిన్నెలు, ఇంగ్రీడియంట్స్ కోసం స్టీలు కంటైనర్లు, వండిన వాటిని వడ్డించేందుకు స్టీలు బకెట్లు, అన్నం వడ్డించే కఫ్గీర్ (స్టాకింగ్ చెయ్యి అంటారు), కూరలు వడ్డించేందుకు గంటెలు తదితరాలను ప్రతి బడికి అందించనున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాత్రలను అందించేందుకు జిల్లా విద్యాశాఖకు నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లోనే సరఫరాకు బిడ్లు పిలవనున్నారు. జిల్లా స్థాయిలో వంటపాత్రల సరఫరాకు అన్ని రకాల అర్హతలున్న పంపిణీదారుల నుంచి టెండర్లు ఆహ్వానించనున్నారు. తాజాగా ప్రభుత్వ పరంగా వంటపాత్రల కోసం నిధులు మంజూరు చేయడంతో వంట ఏజెన్సీలు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు.. (రూ.లల్లో)

జిల్లా	నిధుల మంజూరు
నల్గొండ	1,18,10,000
సూర్యాపేట	77,90,000
యాదాద్రి	64,80,000

సన్నాలకు ససేమిరా..!




హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, కోదాడ, న్యూస్‌టుడే:

మరో వారం రోజుల్లో మార్కెట్‌లోకి ధాన్యం ఇబ్బడి ముబ్బడిగా రానుంది. మిల్లర్లు మాత్రం సన్నరకాల ధాన్యం మిల్లింగ్ చేసే విషయంపై పట్టు వీడలేదు. ప్రభుత్వం వారి డిమాండ్లపై ఇంకా కొలిక్కి రాలేదు. సబ్‌కమిటీ ఒక నిర్ణయం తీసుకుని సీఎంకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే సన్న రకాలను ఎక్కడికి పంపుతారన్న విషయంపై స్పష్టత లేదు. ధాన్యం నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ ఖర్చులు పెరుగుతాయన్న దానిపై తర్జన భర్జన పడుతున్నారు. ఇతర భారాలు నెత్తికి ఎత్తుకోకుండా మిల్లర్లకే ఇవ్వాలన్న ఆలోచనకు వచ్చినట్లు సమాచారం.


హుజూర్‌నగర్ సమీపంలో కోతకు సిద్ధంగా సన్నరకం వరి

పెరగనున్న అవసరాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యం 10,69,029 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా. ప్రభుత్వం సన్న రకాల ధాన్యం తీసుకుని పౌరసరఫరాల అవసరాలకు వాడుకోవాలని చూస్తోంది. జనవరి నుంచి పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకు సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నరకాల ధాన్యం పండించిన రైతుకు రూ.500 బోనస్ కూడా ప్రకటించింది. ఇప్పటి వరకు సన్న రకాల ధాన్యాన్ని మిల్లులకు పంపించాలా, గోదాములలో ఉంచాలా అనే నిర్ణయం కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



★ సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు దొడ్డు రకాలకు వచ్చినట్లు 67 కిలోల బియ్యం రావని, 57 కిలోలు మాత్రమే వస్తాయని మిల్లర్లు అంటున్నారు. ప్రభుత్వం మాత్రం దొడ్డు రకమైనా, సన్న రకమైనా క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలంటుంది. తేమ శాతంతో సన్న రకాల ధాన్యం దిగుమతి చేసుకుంటే నెల రోజుల్లోపే రంగు మారిపోతుందని మిల్లర్లు చెబుతున్నారు. అందుకు తేమ శాతాన్ని 14 శాతానికి మార్చాలంటున్నారు. మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు పెంచాలని పట్టుబడుతున్నారు.

కొనుగోళ్లకు సర్వం సిద్ధం

ధాన్యాన్ని రెండు రకాలుగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసింది. దొడ్డు రకాలు ఒక కేంద్రంలో, సన్న రకం మరో కేంద్రంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సన్నరకాలను గుర్తించేందుకు ప్రత్యేక సాంకేతిక పద్ధతులను అవలంబించనున్నారు.



ఉమ్మడి జిల్లాలో అక్టోబరు 2,22,711 నవంబరు 6,58,334 డిసెంబరు 5,17,814 జనవరిలో 1,21,363 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.


నూతనకల్‌లో వరిపైరును నిటారుగా కట్టలు కడుతున్న కూలీలు

వాలిన పొలం... నిలబెడితేనే ఫలం


ఇటీవల కురిసిన గాలులతో కూడిన వర్షాలకు నూతనకల్‌లో సన్నరకం వరి పొలాలు అడ్డంపడ్డాయి. వరదనీటిలో కంకులు మునిగాయి. ఆ పైరును నిలబెట్టకుంటే కంకులు తడిసిపోయి మొలకెత్తి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతనకల్‌కు చెందిన రైతు ఉప్పుల వెంకన్న వరదకు అడ్డం పడిన తన ఎకరం పొలాన్ని రూ.20 వేలు వెచ్చించి కూలీలతో కట్టలు కట్టించి నిలబెట్టారు.
● చిదుముళ్ల మధుసూదన్‌రెడ్డి నాలుగు రోజులు శ్రమించి మోకాళ్లోతు బురదనీటిలోకి దిగి మడిలో వాలిపోయిన వరిని కట్టలు కట్టారు. రూ.వేలు పెట్టుబడి పెట్టి పండించిన పంటను నిలబెట్టుకుంటేనే తిండి గింజలు ఇంటికి చేరే పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. - నూతనకల్, న్యూస్‌టుడే



నిర్మించిన ఏడాదికే కుంగిన రహదారి

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు నుంచి ఎస్పీ కార్యాలయానికి వెళ్లే రహదారి కుంగుతోంది. వాహనాల రాకపోకలతో నాలా వైపులు జరిగి రహదారి కుంగి గుంతలు ఏర్పడ్డాయి. నాలా పక్కనే ఉండటం, రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడూ ఏం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం మీదుగా ఎక్కువ మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో గతేడాది బీటీ రహదారి నిర్మించారు. నాణ్యతగా చేపట్టకపోవడంతో ధ్వంసమవుతోంది. నిర్మాణం సమయంలో అధికారులు పర్యవేక్షణ చేపట్టకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారని ప్రయాణికులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ యుగేందర్‌ను వివరణ కోరగా మరమ్మతు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

పల్లీ ధర పతనం



క్వింటాకు గరిష్ఠంగా రూ. 4669 చెల్లింపు

ధరల వివరాలు (రూపాయల్లో..)

తేది	గరిష్ఠం	కనిష్ఠం
24	4669	3699
23	4679	4359
22	5459	5459
21	5029	3613
19	3913	3386
18	4379	4379

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పల్లీకి మద్దతు ధర దక్కడం లేదు. రోజురోజుకూ ధర పడిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయానికి తీసుకొస్తే గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు. నాణ్యత, ఇతర కారణాలు చూపుతూ మద్దతు ధర కల్పించటం లేదని, పెట్టుబడులు కూడా రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

పంట చేతికి వచ్చాక తగ్గుదల

సూర్యాపేట జిల్లాలో యాసంగిలో 1442 ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. జిల్లాలో ఎక్కువగా అంతరపంటగా దీన్ని పండిస్తున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. కోదాడ, హుజూర్‌నగర్‌లో వరి పండిస్తారు. వేరుసెనగకు డిమాండ్ ఉన్నా ధర మాత్రం దక్కని పరిస్థితి నెలకొంది. సూర్యాపేట మార్కెట్‌కు గురువారం 16 బస్తాలు వేరుసెనగను రైతులు తీసుకొచ్చారు. ఖరీదుదారులు గరిష్ఠంగా రూ.4669, కనిష్ఠ ధర రూ.3699గా చెల్లించారు. పంట అమ్మితే కనీసం పెట్టుబడులతోపాటు రవాణా ఖర్చులు కూడా పూడే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. సీజన్‌లో మాత్రం వీటి ధర రూ. ఎనిమిది వేలకు పైగా ఉంటోంది. పంట చేతికిరాగానే అధికారులు, ఖరీదుదారులు ధరలు తగ్గిస్తున్నారు. దీంతో కొంతమంది రైతులు చేసేదిలేక ఇంటి వద్దే నిల్వ ఉంచుకుంటున్నారు. 'నాణ్యతను బట్టే ఖరీదుదారులు ధర నిర్ణయిస్తారని, రైతులు నాణ్యమైన పంటను తీసుకొచ్చి మద్దతు ధర పొందాల'ని మార్కెట్ కార్యదర్శి సంతోష్ కుమార్ తెలిపారు.




సూర్యాపేటలో ఘరానా దొంగ అరెస్టును చూపుతున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ★ నకిలీ బంగారు బిస్కెట్

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: నకిలీ బంగారు బిస్కెట్ తనఖాగా పెట్టి ర్యాపిడో బైక్‌ను ఎత్తుకెళ్లిన ఘరానా మోసగాన్ని సూర్యాపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా మచిలీపట్నం గొడుగుపేట గ్రామానికి చెందిన విన్నకోట సాయికుమార్ ఆగస్టు 7న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాలని నిర్ణయించుకొని హనుమకొండ నుంచి జనగామ వరకు ర్యాపిడో ద్విచక్ర వాహనాన్ని ఆన్‌లైన్లో బుక్ చేసుకున్నాడు. అనంతరం జనగామ నుంచి సూర్యాపేట వరకు తీసుకెళ్లాలని.. అదనంగా రూ. వెయ్యి చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. సూర్యాపేటలోని కొత్తబస్టాండు వద్దకు వచ్చిన తర్వాత తనకు వ్యక్తిగతంగా పని ఉందని.. ద్విచక్ర వాహనం కొద్ది సేపు ఇవ్వాలని కోరాడు. ర్యాపిడో డ్రైవర్ అంగీకరించకపోవడంతో నకిలీ బంగారు బిస్కెట్‌ను తనఖాగా పెట్టి వాహనాన్ని తీసుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడు సాయికుమార్ శుక్రవారం సూర్యాపేటలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేశారు. ఇతనిపై ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఓఎల్‌ఎక్స్‌లో పెట్టిన సుమారు యాభై ద్విచక్ర వాహనాలను మాయమాటలతో దొంగతనం చేసిన కేసులు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషి చేసిన ఎస్సైలు కె.గోపికృష్ణ, కుశలవ, హెడ్ కానిస్టేబుల్‌లు కరుణాకర్, కృష్ణ సైదులు, కానిస్టేబుల్‌లు శివ, మధును ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

ఆవులు, దూడలను కుక్కి.. అక్రమ తరలింపు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అక్రమంగా ఆవులను తరలిస్తున్న డీసీఎంను శుక్రవారం తెల్లవారుజామున అర్వపల్లిలో సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి హైదరాబాద్‌కు అతి వేగంగా, అజాగ్రత్తగా డ్రైవర్ కేతావత్ కళ్యాణ్ డీసీఎం నడిపి ముందు వెళ్తున్న లారీని అర్వపల్లిలో ఢీకొట్టాడు. డీసీఎం ముందు భాగం ధ్వంసం కాగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఏఎస్సై రాములు, హోంగార్డు నాగయ్య ఘటనా స్థలానికి చేరుకుని ఆ వాహనాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా వాహనంలో 56 పశువుల(40 ఆవు దూడలు, 16 కోడె దూడల)ను తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువుల సంరక్షణ, తాగునీరు, ఆహారం కోసం నాగర్ కర్నూల్ జిల్లాలోని కర్వేనిపల్లి గోశాలకు ఆవులను తరలించారు. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఏఎస్సై రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు అర్వపల్లి ఎస్సై బాలకృష్ణ తెలిపారు.


అర్వపల్లిలో పోలీసులు పట్టుకున్న పశువుల వాహనం

సమన్వయ లోపం.. నియంత్రణలో వైఫల్యం!

చింతలపాలెం(మేళ్లచెరువు), న్యూస్‌టుడే: చింతలపాలెంలో అతిసార వ్యాధిని నియంత్రించడంలో అధికార యంత్రాంగ సమన్వయ లోపం స్పష్టంగా కన్పిస్తోంది. ఈ నెల 16వ తేదీ నుంచి అతిసారం కేసులు ఇక్కడ నమోదవుతుండగా, మూల కారణాలను అన్వేషించడంలో అటు వైద్య, ఇటు పంచాయతీ రాజ్, మరోవైపు నీటి సరఫరా విభాగాలు సాదాసీదాగానే వ్యవహరించాయి. బాధితుల సంఖ్యలో రోజుకొకతీరుగా హెచ్చుతగ్గులు కన్పిస్తున్నా.. వారం రోజుల వ్యవధిలో రెండు ప్రాణాలు బలవ్వడం వైఫల్యాన్ని చూపిస్తోంది. వాస్తవంగా నెల రోజుల కిందటే రెండుమూడు అతిసారం ప్రభావిత ప్రాంతాలను గుర్తించినప్పటికీ.. అధికార యంత్రాంగం సీరియస్‌గా తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. ఆలస్యంగా స్పందించినప్పటికీ.. అతిసార వ్యాధి ప్రబలడానికి మూల కారణం ఎక్కడెక్కడ ఉందనేది ఇంతవరకు అధికారులు స్పష్టంగా చెప్పలేకపోతుండటం గమనార్హం.

తాగునీటి వ్యవస్థ మెరుగుపర్చడంలో నిర్లక్ష్యం..


చింతలపాలెంలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మంచినీటి ట్యాంకులు, మిషన్ భగీరథ పైపులైన్లు, ఇంటింటి కనెక్షన్లు ఉన్నాయి. కానీ.. ఆ నీటి సరఫరాయే లేదు. ఒకట్రెండుసార్లు నీరొదిలినా.. ఎక్కడికక్కడే పైపుల లీకేజీలతో ఇళ్ల నల్లాల వరకు నీరెళ్లే పరిస్థితి లేదు. ఈ సమస్యను ఎప్పుడో గాలికొదిలేశారు. బోరు బావుల ద్వారానే కాలనీలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ నీరూ మురుగు కాల్వల్లో లీకుల పైపుల గుండా వెళ్తుండగా, ఇవే నీటిని పట్టుకుని తాగుతున్నారు. కొన్ని చోట్ల పై కప్పుల్లేని చిన్న ట్యాంకులకు ఎక్కించిన నీటినే వాడుతున్నారు. ఓ ఆర్వో ప్లాంటు నీటి కలుషితంపైనా అనుమానాలొచ్చాయి. ఇటీవల వరదలొచ్చిన తర్వాత కూడా బోర్ల నీటి సరఫరాపై దృష్టి సారించలేదు. ఈ ఊళ్లో దాదాపు 36 బోరు బావులుండగా, ఇప్పటివరకు నాలుగు బోర్ల నీటిని వాడిన వారే బాధితులుగా ఉన్నారని వైద్య బృందం పేర్కొంటోంది. అతిసారం ప్రబలిన నేపథ్యంలోనూ.. మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించడంలో నిర్లక్ష్యం చేశారు. వాటర్ ట్యాంకులతో శుద్ధనీరు పంపిణీ చేయలేదు. మిగతా తాగునీటి వ్యవస్థను మెరుగుపరచడంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


మిషన్ భగీరథ లీకేజీలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అప్పారావు


నీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రతను పరిశీలిస్తున్న వైద్యబృందం

నమూనా ఫలితాలపై అయోమయం

గడిచిన వారంలో అతిసార వ్యాధి బారిన పడిన వారు 42 మందేనని చెబుతున్న వైద్యబృందం.. వ్యాధి వ్యాప్తికి మూల కారణాన్ని ఇంకా అన్వేషిస్తున్న క్రమంలో.. నీటిలో మినరల్స్‌పై వైద్య, నీటి సరఫరా విభాగాలు వేర్వేరుగా జరిపించిన పరీక్షల్లోనూ ఫలితాలు తేడాగా వచ్చినట్లు తెలుస్తోంది. వైద్య బృందం నీరు కలుషితమైందని చెబుతుండగా, నీటి సరఫరా శాఖకు భిన్నంగా నివేదిక వచ్చినట్లు సమాచారం. ఈ అయోమయంలో.. కలెక్టరు ఆదేశాల మేరకు ఆయా శాఖల జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకొచ్చారు. రెండ్రోజుల కిందట వరకు 12 నమూనాలను పంపించినా, కొన్నింటి ఫలితాలింకా రాలేదు. ఐనా స్పష్టత కోసం మళ్లీ అతిసార కారక బ్యాక్టీరియా పరీక్షలకు 36 బోర్లు, అనుమానిత ఒక వాటర్ ప్లాంటు నీటి నమూనాలను శుక్రవారం పంపించారు.



మూడేళ్లుగా స్నానాల గదే ఆవాసం

కడు పేదరికంలోనూ వారసత్వంగా వచ్చిన పూరింట్లోనే దర్జీగా జీవనం సాగిస్తూ ఇద్దరు మగ పిల్లల్ని పెంచి పెద్ద చేశారు ఆయన. కుమారులు లారీ డ్రైవర్‌గా ఒకరు, పొలం పనులు చేసుకుంటూ మరొకరు చెరో దారి చూసుకుని వేరే గ్రామాల్లో స్థిరపడ్డారు. జీవితాంతం తోడుండాల్సిన భార్య అనారోగ్యంతో తనువు చాలించింది. అనూహ్యంగా ఒంటరి వాడైన దర్జీ పల్లెలో తన వృత్తికి ఆదరణ కరవై పూటగడవని స్థితిలో కూలీగా ఒంటరి జీవనం గడుపుతున్నాడు. అప్పటి వరకు ఉంటున్న పూరిల్లూ చెదలు పట్టి కూలిపోవడంతో మళ్లీ ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక మూడేళ్లుగా అదే స్థలంలోని స్నానాల గదిలోనే నివాసం ఉంటున్నారు.



★ మఠంపల్లి మండలం బక్కమంతులగూడేనికి చెందిన షేక్ మస్తాన్, మస్తాన్‌బీ దంపతులకు ఇద్దరు సంతానం. వ్యవసాయ భూమి లేదు. దుస్తులు కుట్టి కుటుంబాన్ని పోషిస్తున్న మస్తాన్ భార్య 2019లో అనారోగ్యానికి గురై మృతి చెందింది. కుమారులు ఇద్దరూ బతుకు తెరువు కోసం ఇళ్లు విడిచి వెళ్లారు. దొరికిన పని చేసుకుంటూ మరుగు దొడ్డి పక్కనే ఉన్న స్నానాల గదిలోనే వండుకుని తినడంతో పాటు అక్కడే పడుకుంటున్నట్లు మస్తాన్ చెప్పారు. సరిగ్గా పడుకునేందుకూ సరిపోని స్నానాల గదే తనకు నివాసమైందని చెబుతున్నారు. దుర్భర పరిస్థితిలో ఉన్న తనకు ఇల్లు మంజూరు చేయాలని ప్రాధేయపడుతున్నారు.

- మఠంపల్లి, న్యూస్‌టుడే



నిన్ను నువ్వు పరీక్షించుకో..!

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వారిని చైతన్య పరిచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పాఠశాల స్థాయి మొదలుకుని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో సుమారు 3,836 పాఠశాలలుండగా 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సుమారు 92 వేల మంది విద్యార్థులకు పైనే ఉన్నట్లుగా తెలుస్తోంది.

- రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే

నవంబరు 7న
పాఠశాల స్థాయి
చెకుముకి సంబరాలు

పాఠశాల మొదలుకుని రాష్ట్రస్థాయి వరకు..

విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబరు మాసంలో ఎంపిక చేసిన ప్రాంతంలో 14-16 వరకు నిర్వహించనున్నారు.

★ 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఈ పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపనున్నారు.

ప్రణాళికతో ముందుకు..


రాజపేటలోని ఓ పాఠశాల ఆవరణలో శాస్త్రీయ అంశాలను శ్రద్ధగా వింటున్న విద్యార్థులు (పాతచిత్రం)

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లుగా నిర్వాహకులు అంటున్నారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా వివరిస్తున్నారు.



విద్యార్థులకు మంచి అవకాశం: కొణతం శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక, జిల్లా ప్రధానకార్యదర్శి, యాదాద్రి భువనగిరి

సమగ్రశిక్ష, జేవీవీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే వివిధ రకాల పోటీలు వారికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. ముఖ్యంగా సైన్స్‌పట్ల మరింత అవగాహన పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వారి భవిష్యత్తు దృష్ట్యా ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు చొరవ చూపితే ప్రయోజనకరం.



ఆయుధం.. వాడేవిధం..!

మీ కోసం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ఒకప్పుడు పోలీసులు తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే ప్రతి ఒక్కరు హడలెత్తిపోయే వారు. మారిన పరిస్థితులను బట్టి పోలీసులు ఆయుధాల వాడకం చాలా వరకు తగ్గింది. ప్రస్తుతం వివిధ స్థాయిలో వాడుతున్న ఆయుధాల గురించి నేటి తరం వారికి అంతగా తెలియదు. దీంతో పోలీసుల పనితీరు, ఆయుధాల గురించి తెలిపేందుకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులు ప్రస్తుతం వాడుతున్న ఆయుధాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

పిస్టల్, రివాల్వర్ విధి నిర్వహణలో స్వీయ రక్షణ కోసం చిన్న ఆయుధాలు వాడుతారు. వీటిలో పిస్టల్, రివాల్వర్లుంటాయి. పిస్టల్‌లో 13 బుల్లెట్లు ఉండగా.. పది మాత్రమే లోడ్ చేస్తారు.. రివాల్వర్‌లో ఆరు బుల్లెట్లు ఉంటాయి. ప్రస్తుతం అందరూ పిస్టల్‌లే వాడుతుండగా.. వీటిలో సాధారణ పిస్టల్, బ్లాక్ పిస్టల్ అని రెండు రకాలుంటాయి. సాధారణ పిస్టల్ ఇనుముతో కూడి ఉండగా.. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన బ్లాక్ పిస్టల్ తేలికైన పదార్థంతో తయారు చేసి ఉంటుంది.

ఎస్ఎల్ఆర్.. ఇవి పొడవుగా ఉండి వివిధ నాయకులు, అధికారులకు రక్షణగా ఉండే గార్డులు ఈ ఎస్ఎల్ఆర్ తుపాకులు వాడుతారు. ఇవి సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్. వీటిలో 20 బుల్లెట్లు ఉంటాయి. అడవుల్లో కూంబింగ్ చేసే సందర్భాల్లో సైతం వీటిని వాడుతారు.

కార్బన్.. వ్యక్తిగత సహాయకులు కార్బన్ ఆయుధాలు వాడుతారు. ఇవి అడుగు పొడవులో ఉండి.. ప్రజా ప్రతినిధులు, అధికారుల వెంట ఉండే రక్షణ సిబ్బంది చేతుల్లో ఎక్కువగా చూస్తూ ఉంటాం. వీటిని సెమీ ఆటో మెటిక్ వెపన్స్ అంటారు. వీటిలో 32 బుల్లెట్లు ఉంటాయి.

ఏకే 47.. జెడ్ కేటగిరీ భద్రత కలిగి ఉన్న నాయకులు, అధికారుల వ్యక్తిగత రక్షణ సిబ్బంది ఏకే 47 తుపాకులు వాడుతారు. అడవుల్లో కూంబింగ్ సమయంలో సైతం వీటిని వాడుతుంటారు. ఇది ఆటోమెటిక్ వెపన్. దీనిలో కూడా 30 బుల్లెట్లు ఉంటాయి.

303 తుపాకులు


మిర్యాలగూడలో పిస్టల్ పని తీరు గురించి విద్యార్థులకు వివరిస్తున్న రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు

రక్షణ సిబ్బంది, కూంబింగ్ చేసే సందర్భాల్లో పొడవుగా ఉండే 303 తుపాకులు సైతం వాడుతారు. వ్యక్తిగత సహాయకులు సైతం దీనిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం వీటి స్థానంలో ఎస్ఎల్ఆర్‌లు వాడుతున్నారు.

★ పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది ఈ ఆయుధాలు అన్నింటి వాడకంపై అవగాహన కలిగి ఉంటారు.

మొరాయిస్తున్న ట్యాబ్‌లు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

లక్ష్యం సమున్నతమే.. కానీ ఆచరణలో అగచాట్లు తప్పడం లేదు. వ్యవసాయ సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017, 18 సంవత్సరంలో ఏఈవోలకు ట్యాబ్‌లను, సిమ్‌లను అందజేసింది. ప్రస్తుతం ఆ ట్యాబ్‌లు మొరాయిస్తున్నాయి. ట్యాబ్‌లు పంపిణీ చేసి ఆరేళ్లు కావొస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ఛార్జింగ్ ఉండకపోవడంతో ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు. పంటల నమోదు కోసం క్షేత్రస్థాయి సందర్శనకు పంట పొలాల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్న సమయంలో హ్యాంగ్ కావడం, వివరాలు సగం ఆన్‌లైన్ చేశాక స్విచ్ఛ్‌ఆఫ్ అవ్వడం తలనొప్పిగా మారింది. దీంతో మళ్లీ మొదటి నుంచి పొందుపరచాల్సి వస్తుంది. సాఫ్ట్‌వేర్ సమస్యలకు తోడు కొన్ని ట్యాబ్‌లకు నెట్ వర్క్ సంకేతాలు కూడా అందడం లేదు. పలు చోట్ల ట్యాబ్‌ల డిస్‌ప్లేలు పగిలిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని పలువురు వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఏఈవోలే మరమ్మతులు చేయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పాత ట్యాబ్‌ల స్థానంలో కొత్త వాటిని ఇవ్వాల్సి ఉన్నా వాటిపై ఎలాంటి కదలిక లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఏఈఓలు	
నల్గొండ	140
సూర్యాపేట	98
యాదాద్రి	72

నమోదు చేసే వివరాలు
★ రైతుబంధు ★ రైతుబీమా
★ పంటల నమోదు ★ కోతుల బెడద


ట్యాబ్‌లు మొరాయించడంతో సెల్‌తో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈవో

చరవాణిల ద్వారా ఆన్‌లైన్ చేసుకోవచ్చు.

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ట్యాబ్‌లు ప్రస్తుతం అక్కడక్కడ మొరాయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. పరికరాలు మొరాయిస్తే చరవాణిల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ట్యాబ్‌ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

పసుపు పచ్చగా... ప్రకృతి మెచ్చగా..!



కనుచూపు మేర చిలకపచ్చరంగులో వరి పైరు అందమిది.. నగర శివారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రుద్రారం, జూలూరు గ్రామాల మధ్య మూసీ పరివాహకంలో వేలాది ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. కోత సమయంలో వరిపైరు ఇలా కొంత ముదురు గోధుమ, కొంత ఆకు పచ్చరంగులో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది.

- ఈనాడు, నల్గొండ

27న పదివేల మందితో మూసీ పునరుజ్జీవ సభ: ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, అడ్డగూడూరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు పవిత్రమైన నీరు పారే మూసీనది నేడు కాలుష్యంతో నిండిపోయిందని, అందుకే ఈ నది ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూనుకున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ముఖ్యమంత్రి తలపెట్టిన ఈ మహాకార్యానికి నదీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు మద్దతు తెలిపేందుకు ఈ నెల 27న పదివేల మందితో అడ్డగూడూరు మండలం మానాయికుంట వద్ద గల వంతెన వద్ద మూసీ పునరుజ్జీవ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శుక్రవారం మానాయికుంట వంతెనపైన మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల ముఖ్య నాయకులతో సభాస్థలిని పరిశీలించి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికారాబాద్ కొండల్లో పుట్టి నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసే మూసీ నది హైదరాబాద్ మహానగరం మీదుగా సాగుతుందని, దీనిపై ఎన్నో అనుబంధ కాల్వలు నిర్మించి సాగు, తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. కలుషితమైన ఈ నీటిని గత ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో శుద్ధి చేసేందుకు ఓ కమిటీని కూడా వేసిందని చెప్పారు. ఆ కమిటీ జాడ లేదని, ఎందుకు ఆ పనులు ప్రారంభించలేదో అప్పటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు. డీపీఆర్ లేదని, పదేళ్లు పాలించి ఎంత దోచుకున్నారో, ఎంత దాచుకున్నారో ప్రజలకు తెలుసని విమర్శించారు. మూసీకి పునరుజ్జీవం కల్పించేందుకు ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి మద్దతు తెలుపుతూ, మూసీ నదిని కాపాడుకునేందుకు ఈ ప్రాంత రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముఖ్య నాయకులు వంగాల సత్యనారాయణ, లింగయ్య, అన్నెబోయిన సుధాకర్, నిరంజన్‌రెడ్డి, చామల అనిల్‌రెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, బాలరాజు, వేణుగోపాల్‌రెడ్డి, జోజి, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.


మానాయికుంట వంతెన సమీపంలో సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు

సాగర్ నుంచి 12గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి వరదనీటి రాక తగ్గటంతో 12 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 1,45,136 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు 12 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 96,324 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతోపాటు కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా మొత్తం 1,45,136 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 589.30 అడుగుల వద్ద ఉంది.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

దేవరకొండ, న్యూస్‌టుడే: కార్తికమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏపీలోని పంచారామక్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు శుక్రవారం స్థానికంగా తెలిపారు. ★ అమరావతిలోని అమరలింగేశ్వరస్వామి, భీమవరంలోని సోమేశ్వరస్వామి, పాలకొల్లులోని క్షీరలింగేశ్వరస్వామి, ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి, సామర్లకోటలోని భీమలింగేశ్వరస్వామి క్షేత్రాలకు నవంబరు 03, 10, 17, 24 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. ఒకేరోజు పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు, దీంతోపాటు కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబరు 13న తమిళనాడులోని అరుణాచలగిరి సందర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. పంచారామ క్షేత్రాలకు డీలక్స్ బస్ ఛార్జీలు.. పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1200 ఉంటుందన్నారు.

అధిక సాంద్రత విధానంతో.. లాభాల సంపత్తి


అధిక సాంద్రత పత్తి పంట ప్రదర్శన క్షేత్రం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

పత్తి సాగులో ఆశించిన దిగుబడులు రావడం లేదు. పైగా కూలీల కొరత ఉంటుంది. ఒకేసారి దిగుబడి, అది కూడా ఎక్కువ మొత్తంలో వచ్చేలా అధిక సాంద్రత విధానంలో పత్తి పంటను సాగు చేసేందుకు రైతుల పంట పొలాల్లో ప్రయోగ క్షేత్రాలు నిర్వహించారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 1500 ఎకరాల్లో సాగు చేశారు. రైతుకు ఒకేసారి కాత, పూత, కోత వస్తే ఎలాంటి సమస్య ఉండదు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసిన రైతుకు జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఎకరాకు రూ.5వేలు ప్రోత్సాహం ఇస్తుంది. ప్రస్తుత సాగు చేస్తున్న సాధారణ పద్ధతులకు భిన్నంగా మూడు విధానాల్లో రైతుల పంట పొలాల్లో సాగు చేయించి, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పరిశోధనలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగు (ఎకరాల్లో)		
నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
600	500	400

60 లక్షల ఎకరాల్లో..

రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో (18 శాతం) పత్తి సాగులో ఉంది. ఏటా పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల బెడద, కూలీల కొరతను అధిగమించేందుకు జాతీయ పత్తి పరిశోధన సంస్థ నూతన విధానంలో పత్తి సాగుకు మొగ్గు చూపింది. గతేడాది ప్రయోగాత్మకంగా సాగు చేసిన ప్రాంతాల్లో సత్ఫలితాలు రావడంతో ఈ సీజన్‌లో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో డాట్ సెంటర్లు, కృషి విజ్ఞన కేంద్రాలతో పాటు ఆసక్తి గల రైతులను ఎంపిక చేసి ప్రయోగ క్షేత్రాలను ఏర్పాటు చేశారు.

దిగుబడి
ఈ విధానంలో పత్తి దిగుబడి 12-14 క్వింటాళ్లు వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సీజన్‌లో ఇప్పటికే కొందరికి ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు వివరించారు.

ఒకేసారి ఏరడం..

సాధారణానికి భిన్నంగా మొక్కల సంఖ్యను పెంచి సాగు చేస్తే దిగుబడి ఎక్కువగా వచ్చే వీలుంది. దీనికి రెండు పద్ధతులను పాటించి ప్రయోగక్షేత్రాలను నిర్వహిస్తున్నారు. అధిక సాంద్రత విధానంలో వరసల మధ్య 90 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ.లు ఉండేలా విత్తనం నాటారు. సంప్రదాయ పద్ధతిలో ఎకరానికి 10 వేల మొక్కలు ఉంటే అధిక సాంద్రత విధానంలో 29,629 మొక్కలు వస్తాయి. సాధారణ పత్తి సాగులో 180 రోజులుంటే విడతల వారీగా అయిదు సార్లు పత్తి ఏరాల్సి ఉంటుంది. అధిక సాంద్రత విధానంలో అయితే 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. పైగా ఒకేసారి ఏరడం పూర్తవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు

రైతులకు ప్రోత్సాహం

– డాక్టరు అనిల్‌కుమార్ సీనియర్ శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం యాదాద్రి



సాధారణ విధానంలో పత్తి సాగు యాంత్రీకరణకు అనుకూలంగా ఉండదు. నూతన విధానంలో సాగు లాభదాయకం. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి ఎంపిక చేసిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహం అందిస్తున్నాం. గతేడాది, ఇప్పుడు రైతులకు ఎకరాకు 12-14 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది. భవిష్యత్తులో సాగు విస్తీర్ణం పెంచాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.



భళా.. వనమాల

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ విజేతగా శశాంక్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: తమిళనాడు రాజధాని చెన్నైలో శుక్రవారం జరిగిన అండర్-15 సింగిల్స్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వనమాల శశాంక్ విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతూ.. రాష్ట్రం తరఫున టోర్నీలో పాల్గొన్న శశాంక్.. అండమాన్ నికోబార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ క్రీడాకారులపై విజయం సాధించి.. ఫైనల్స్‌లో ప్రవేశించాడు. ఫైనల్స్‌లో కర్ణాటక క్రీడాకారుడు పుష్కర్ సాయిపై 21-9, 15-21, 21-17 తేడాతో విజయం సాధించి జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా మిర్యాలగూడకు చెందిన బ్యాడ్మింటన్ జిల్లా శిక్షకుడు మారబోయిన రామకృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, నవీన్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115–00
రిటైల్	137–00
డ్రెస్డ్	199–00
స్కిన్‌లెస్	226–00

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి నష్టపోవద్దు

మునగాల, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని, అప్పులు తెచ్చి ఆర్థిక సమస్యల్లో చిక్కుకోవద్దని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఠాణాలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఆర్జీపీ యాప్‌లో ప్రజలు పెద్ద ఎత్తున సమూహంగా ఏర్పడి, అత్యాశకు పోయి వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి, యాప్ ఎత్తివేయడంతో నష్టపోయినట్లు తెలిపారు. ఎవరైనా వ్యక్తులు ఇలాంటి మోసపూరిత యాప్‌లో చేరాలని చెప్పినప్పుడు వారిపై ఠాణాలో ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

కోదాడ పట్టణం: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారి సీసీఆర్ విద్యానిలయం సమీపంలో వీధి దీపాలు పనిచేయడం లేదు.
–అర్జున్, కోదాడ

✔ పరిశీలించి వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.
–నాగరాజు, పుర ఎలక్ట్రీషియన్, కోదాడ

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: భక్తులకు ఇబ్బందులు లేకుండా మహా రుద్రాభిషేకం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎస్సై ముత్తయ్య తెలిపారు. 27న నాగ సాధువులతో మహా రుద్రాభిషేకం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై ముత్తయ్య

మహా రుద్రాభిషేకం నిర్వహణ కమిటీతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. శివలింగానికి జల, ఫల, పుష్ప, పంచామృతాలతో అభిషేకం జరుగుతున్నందున భక్తులు, మహా రుద్రాభిషేకం చూసేందుకు వచ్చినవారికి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు కూడా బంధు మిత్రులతో వచ్చి ప్రశాంతంగా తిలకించాలని కోరారు. నిర్వహణ కమిటీ సభ్యులు ప్రభాకర్, నరసింహారావు, నాగేశ్వరరావు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

27న హుజూర్‌నగర్‌లో మాంసం విక్రయాలు బంద్

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్‌లో ఈనెల 27న మహా రుద్రాభిషేకం జరుగుతున్నందున పురపాలక సంఘం పరిధిలో మాంసం విక్రయాలు జరుపరాదని పురపాలక కమిషనర్ యాకుబ్‌పాషా ఒక ప్రకటనలో తెలిపారు. 27న నాగ సాధువులతో భారీగా మహా రుద్రాభిషేకం జరుగుతుందని, మాంసం విక్రయాలు ఒకరోజు బంద్ చేయాలని కమిటీవారు కోరినందున విక్రయించరాదని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

లక్షలు ఖర్చు చేసి.. కోట్లు కాజేసి



మునగాల మండలం బరాఖత్‌గూడేనికి చెందిన ఓ వ్యక్తి యాప్‌లో రీజినల్ మేనేజర్‌గా పని చేస్తూ కీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ, సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. యాప్‌లో పెట్టిన డబ్బులు నెలలోనే రెట్టింపు కావడంతో గ్రామంలో చాలా మంది పెట్టుబడి పెట్టారు. గ్రామానికి ఆనుకొని ఉన్న ఆకుపాముల, ముకుందాపురం గ్రామాల్లోని వారు విపరీతంగా పెట్టుబడి పెట్టారు. ఫలితంగా కోదాడ పట్టణంలో బ్రాంచ్ ప్రారంభించి గత నెల నుంచి కార్యాకలాపాలు ముమ్మరంగా కొనసాగించారు. ఈ గ్రామాల వారే సుమారు రూ.10 లక్షలు పెట్టినట్లు సమాచారం.

కోదాడకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి మొదట్లో యాప్‌లో సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టడంతో నెల రోజుల్లోనే రూ.1.50 లక్షలు వెనక్కి రావడంతో.. ఈ దఫా రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టి విత్ డ్రాకు ఎదురు చూస్తుండగా సంస్థ యాప్ పని చేయకపోవడంతో లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన తన కుటుంబ సభ్యులను, స్నేహితులను యాప్‌లోకి ఆహ్వానించి పెట్టుబడి పెట్టించడంతో ఇప్పుడు వారు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు శాఖకు సంబంధించిన ఉద్యోగులు కూడా ఉన్నారనే ఆరోపణలున్నాయి.

కోదాడ, న్యూస్‌టుడే:

ఆర్జీపీ యాప్.. గత రెండు నెలలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాపకింద నీరులా వ్యాపించిన పేరు. ప్రచారం, హడావుడి లేకుండా ఒకరి నుంచి ఒకరికి వ్యాపించింది. వారంలోనే చెల్లించిన డబ్బులతో పాటు నెల తిరిగేలోపు అదనంగా వస్తుండటంతో ప్రజలు బాగా నమ్మారు. ఈ యాప్ ప్రజల్లోకి బలంగా చొచ్చుకుపోయేలా కోదాడ నియోజకవర్గానికి చెందిన వారే పని చేసినట్లు తెలుస్తోంది.

నిరుద్యోగులే లక్ష్యం..

గ్రామాల్లోని అమాయక ప్రజలు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని



యాప్‌లో తక్కువ పెట్టుబడి (రూ.1,800) వారితో పెట్టిస్తారు. వారంలోనే వారి అకౌంట్లో డబ్బులు వేస్తున్నారు. ఇలా ఒక నెల పాటు డబ్బులు రావడంతో వారు నమ్మారు. మొదట్లో ఒక జిజిల్లాలో 100 మంది వ్యక్తులు రూ.1,800 చొప్పున రూ.1,80,000 పెట్టుబడి పెట్టారు. తక్కువ మంది తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టినప్పుడు వారి అకౌంట్లో అదనంగా డబ్బులు వేయడంతో.. సంస్థకు రూ.లక్షల్లో ఖర్చు వచ్చేది. నెల అయ్యేలోపు వేలల్లో పెట్టుబడి పెట్టడంతో సంస్థ దగ్గరకు రూ.కోట్లు వెళ్లాయి. రెండు నెలల పాటు నమ్మించి ఎక్కువ మంది ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టగానే రూ.కోట్ల డబ్బు రావడంతో యాప్‌ను మూసివేశారు.

యాప్‌లో ఎవరూ డబ్బులు పెట్టొద్దు

శ్రీధర్‌రెడ్డి డీఎస్పీ, కోదాడ

ఆర్జీపీ యాప్‌లో పెట్టుబడి పెట్టి చాలా మంది నష్టపోయినట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి ఫిర్యాదులు రాలేదు. ప్రజలు ఎవరూ నమ్మి యాప్‌లలో డబ్బులు పెట్టొద్దు. మీ సమీపంలో ఎవరైనా ఇలాంటి వ్యాపారం చేస్తే మా దృష్టికి తీసుకు రండి.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ

చిలుకూరు, న్యూస్‌టుడే: చిలుకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ మండల సామాజిక తనిఖీ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గిరిబాబు, ఏపీవో నిర్మల శుక్రవారం విలేకరులకు తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పనులకు ఖర్చు చేసిన రూ.4.34 కోట్ల రూపాయలకు మండల స్థాయి సామాజిక తనిఖీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామస్థాయి సామాజిక తనిఖీ పూర్తయినట్లు వివరించారు.

సౌత్ జోనల్ పోటీలకు ఎంపిక

బాలాజీనగర్(కోదాడ పట్టణం, న్యూస్‌టుడే): మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం నల్గొండలో 23న నిర్వహించిన కబడ్డీ పోటీల్లో కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవ



నవీన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు, అధ్యాపకులు

త్సర విద్యార్థి నవీన్ సౌత్ జోనల్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 30 నుంచి నవంబరు 4 వరకు సౌత్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో కళాశాల తరపున పాల్గొననున్నట్లు చెప్పారు.

అవగాహన కార్యక్రమం

నేరేడుచర్ల: దక్కన్ సిమెంట్స్ సామాజిక బాధ్యతగా కర్మాగారం పరిసర గ్రామాల మహిళలకు ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై ప్రభుత్వ వైద్యులతో అవగాహన కార్యక్రమం చేపట్టిందని దక్కన్ సిమెంట్స్ చీఫ్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. పాలకవీడు మండలంలోని దక్కన్ సిమెంట్స్‌లో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరాజు ఆదేశాల కనుగుణంగా ఈ సదస్సు నిర్వహించారు. ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.నాగిని స్త్రీలు, ఆడపిల్లలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో గోమాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ యరగాని గురవయ్య, ధర్మకర్తలు గంధం అంజయ్య, హరీష్, కవిత, నరసింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, అర్చకులు హరీష్ కుమారాచార్యులు, ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

నాణ్యమైన విద్యనందించాలి



నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో సలీంషరీఫ్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో సలీంషరీఫ్ కోరారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు అంకులయ్య, రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ హాజరై మాట్లాడారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాలు ఉచితంగా అందించి సన్మానించారు.

110 చరవాణులను బాధితులకు అందజేశాం: డీఎస్పీ

కోదాడ, న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న చరవాణులను గుర్తించి బాధితులకు అందజేస్తున్నామని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయం ఇటీవల పోయిన 16 చరవాణులను బాధితులకు అందజేసి మాట్లాడారు. ఫిర్యాదు చేసిన బాధితుల ఫోన్లను సీఈఐఆర్(సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) అనే అప్లికేషన్ సాయంతో గుర్తిస్తున్నామన్నారు. ఇప్పటికే 110 చరవాణులు గుర్తించి బాధితులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చరవాణులు అందజేసిన కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం అనునిత్యం పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్‌హాల్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆ సంఘ 105వ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 31 నుంచి నవంబరు 5 వరకు వారోత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆ పోరాట స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజారావు, ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: గనుల్లో భద్రత సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టరు సనంత అన్నారు. మేళ్లచెరువులోని మైహోం సిమెంట్స్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన 39వ గనుల భద్రత వారోత్సవ ముగింపు సభలో మాట్లాడారు. ప్లాంటు హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పరిశ్రమ మైన్స్‌లో అన్ని నిబంధనలను పాటిస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. అంతకుముందు పలువురు ప్రభుత్వ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు మేళ్లచెరువు, వేపలమాధారం, చౌటపల్లి గనులను పరిశీలించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పాఠశాలలను తనిఖీ చేసి.. పనులు పరిశీలించి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పాలకవీడు మండలంలోని హనుమయ్యగూడెం, మీగడం పాడుతండా, రాఘవాపురం ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారి ఇంజమూరి కాటయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఎఫ్ఎల్ఎన్ ఆధారంగా బోధనాభ్యసన కృత్యాల తీరును పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులు పరిశీలించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు కొత్తగా 24 మంది ఉపాధ్యాయులు వచ్చినందున ఇబ్బందులు తొలిగాయన్నారు.

వసతులు.. కొరవడి..!

పరిశీలన

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఒక్కో వార్డెన్‌కి రెండు, మూడు వసతి గృహాల బాధ్యతలు అప్పగిస్తుండటంతో వారు ఎక్కడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండలేని పరిస్థితి నెలకొంది. నేరేడుచర్ల ఎస్టీ వసతి గృహంలో గతంలో 300 లకు పైగా విద్యార్థులు ఉండేవారు. గురుకుల పాఠశాలలు ఏర్పాటైన తర్వాత విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం 120 మంది విద్యార్థులున్నారు. నేరేడుచర్ల పురపాలికలో ఎస్టీ, ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. మూడు వసతి గృహాల్లోనూ రాత్రి వేళల్లో వార్డెన్‌లు అందుబాటులో ఉండే పరిస్థితి లేనందున విద్యార్థులు పూర్తిగా వాచ్‌మెన్‌ల పర్యవేక్షణలోనే ఉంటున్నారు. ఎస్సీ, బీసీ వసతి గృహాల వార్డెన్‌లకు సూర్యాపేట, కోదాడలలోని వసతి గృహాల బాధ్యతలు అప్పగించి ఇక్కడ ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. వసతి గృహాలు తెరిచి ఐదు నెలలు అవుతున్నా విద్యార్థులకు ఇంత వరకు దుస్తులు అందించలేదు. ఒక కార్పెట్, ఒక దుప్పటి, బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు వంటివి అందించారు. చలికాలంలోను ఎక్కడా విద్యార్థులకు స్నానం చేసేందుకు వేడినీటిని అందించే పరిస్థితి లేదు. చన్నీళ్లతోనే స్నానాలు చేస్తున్నారు. ఎస్టీ వసతి గృహంలో బాత్‌రూంలలో పూర్తిస్థాయిలో లైట్లు అమర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. చేయించాల్సిన పనులపై ఉన్నతాధికారులకు నివేదించామని వార్డెన్ చందూలాల్ తెలిపారు.



ఎస్టీ వసతి గృహంలో విద్యార్థులు తక్కువగా ఉండటంతో ఖాళీగా కొన్ని బెడ్లు

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని కూచిపూడిలో శుక్రవారం కోదాడ ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కేంద్రానికి వచ్చే రైతుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, నరేష్, శ్రీనివాసరావు, ప్రభాకర్ రావు, పుల్లయ్య, గోబ్రానాయక్, తదితరులు పాల్గొన్నారు.



కోదాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణ

నడిగూడెం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సరిత కోరారు. శుక్రవారం నారాయణపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీవో ఇమామ్, ఏవో దేవప్రసాద్, ఏపీఎం రామలక్ష్మి, సంఘబంధం సభ్యులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల చేయూత

నడిగూడెం, న్యూస్‌టుడే: మృత్యువాత పడిన మిత్రుడి కుటుంబానికి బాసటగా నిలిచారు చిన్ననాటి స్నేహితులు. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బండారు గురవయ్య గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ పరిస్థితిని గమనించిన బాల్యమిత్రులు శుక్రవారం రూ.50 వేల నగదును పిల్లల పేరున బ్యాంకులో డిపాజిట్ చేసి కుటుంబానికి అందజేశారు. బాల్య మిత్రులు వీరబాబు, నాగుల్‌మీరా, రహీమొద్దీన్, శ్రీను, సత్యం, సైదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని కందిబండ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపలమాధారం గ్రామానికి చెందిన నాల్గో వార్డు మాజీ సభ్యుడు బత్తుల శ్రీను(48) మృతిచెందారు. ఈయన కోదాడ వెళ్లి రాత్రి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా.. కందిబండ సమీపంలో ఇటీవల కూలిన వంతెన వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో ఆయన రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కూలిన ఈ వంతెన పక్కనే ప్రత్యామ్నాయ దారిలోకి మళ్లే క్రమంలో ఎదురుగా ఎత్తుగా కన్పించిన మట్టి కుప్పను తప్పించేందుకు బ్రేకు వేయడంతో వాహన టైర్లు జారి ఉంటాయని స్థానికులు పేర్కొన్నారు. కింద పడిన వాహనం పక్కనే హెల్మెట్ పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. హెల్మెట్‌ను తీసుకెళ్లినప్పటికీ రాత్రి వేళ రోడ్డు బాగా కన్పించదని, దాన్ని తీసి బండి ట్యాంకుపై పెట్టుకుని వాహనం నడుపుతున్నట్లు తెలుస్తోంది. హెల్మెట్ లేకపోవడం వల్లనే రోడ్డుపై పడిన వెంటనే తలకు బలమైన గాయమై ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని పేర్కొంటున్నారు. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని విచారిస్తున్నారు.

మృతదేహం లభ్యం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: పొనుగోడు రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై చలికంటి నరేష్ తెలిపారు. 25-30 వయసున్న వ్యక్తి కుడిచేతికి, కాలికి రాగి కడియం ఉంది. కుడిచేతికి ఉంగరం ఉంది. ఈ ఆనవాళ్లు ఉన్న వ్యక్తికి సంబంధించిన సమాచారం ఉంటే గరిడేపల్లి స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి, న్యూస్‌టుడే: రఘునాథపాలెంలోని ఓ పాడుపడిన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడిచేసి పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్పొరేట్ సెలూన్ ఏర్పాటును ఆపాలని వినతి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల పట్టణంలో కార్పొరేట్ సెలూన్ ఏర్పాటును ఆపాలని కోరుతూ శుక్రవారం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పురఛైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్‌కి వినతి పత్రం అందజేశారు. సుదీర్ఘకాలంగా ఈ వృత్తిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణ కుటుంబాలకు ఇది నష్టం కలిగిస్తుందని సంఘం అధ్యక్షుడు వాసు, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ ఛైర్మన్‌కి తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కాపర్తి శ్రీను, కృష్ణ, లక్ష్మణ్, నాగయ్య, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ అగ్నిమాపక కేంద్రం పరిధిలో దీపావళి పండగకు మతాబులు అమ్మేవారు తప్పకుండా అగ్నిమాపక కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలని, నిబంధనలకు అనుగుణంగా దుకాణం ఏర్పాటు చేసుకోవాలని హుజూర్‌నగర్ అగ్నిమాపక కేంద్రం అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు ఒక దుకాణానికి అనుమతి తీసుకుని దాని వెంట రెండు, మూడు స్టాల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారని, అలాంటివి చేయవద్దని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినా, టపాకాయలు నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభం

మునగాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వ గట్టుపైనున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారులకు 41 రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నల్లపాటి శ్రీనివాస్, పీఏసీఎస్ ఛైర్మన్ కందిబండ సత్యనారాయణలు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శ్రీనివాసచారి మాట్లాడుతూ దాతలు సహకరించాలని కోరారు.

అభి ఇవీ

అభినందన.. కోదాడ: కొమరబండ గ్రామంలో పుట్టి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ స్థాయికి ఎదగడం అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రామారావు స్వస్థలమైన కొమరబండలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు.

శుభాకాంక్షలు.. హుజూర్‌నగర్ గ్రామీణం: చెవిటి వెంకన్న యాదవ్ తెలంగాణ రైతు కమిషనర్ సభ్యుడిగా నియామకమైన సందర్భంగా పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎండీ అజీజ్‌పాషా, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్ కుమార్, ఎంఏ మజీద్, సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

పంపిణీ.. హుజూర్‌నగర్: పేదలను ఆదుకునేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ యరగాని నాగన్నగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జునరావు అన్నారు. మంత్రి ఉత్తమ్ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు.

ఘనంగా చంద్రశేఖరగుప్త వర్ధంతి.. నేరేడుచర్ల: వాసవీక్లబ్ వ్యవస్థాపకుడు కె.చంద్రశేఖరగుప్త వర్ధంతిని శుక్రవారం నేరేడుచర్లలో వాసవీ, వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వాసవీ క్లబ్ జోన్‌ఛైర్మన్‌లు కొత్తా లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. వనితాక్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీప్రసన్న, కవిత, జ్యోతి, వాసవీక్లబ్ ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

◆ 90 యూనిట్లు రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేత

మఠంపల్లి, న్యూస్‌టుడే: సాగర్ సిమెంట్స్ వ్యవస్థాపకుడు, పూర్వ ఎండీ దివంగత సమ్మిడి వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మఠంపల్లిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక కర్మాగారం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పరిశ్రమ సీనియర్ వీపీ ఎంవీ రమణమూర్తి ప్రారంభించారు. 90 మంది కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరంలో దాతలు అందజేసిన 90 యూనిట్ల రక్తాన్ని నల్గొండ జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్లు ఎస్‌వీపీ చెప్పారు. డీజీఎం హరిదాస్, వైద్యాధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పరిశ్రమ సీనియర్ వీపీ ఎంవీ రమణమూర్తి

ఉచితంగా నమోదు చేసుకోండి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకొనేందుకు కోదాడలో సర్వీస్ సెంటర్‌ను ఏపీయూఎస్, పీటీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సాయిరెడ్డితోపాటు ప్రొఫెసర్ మురళీధర్‌రెడ్డిలు ప్రారంభించారు. నయానగర్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉచితంగా సేవలు పొందవచ్చన్నారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** లగ్గం, **రంగా:** పొట్టేల్, **వెంకటేశ్వర:** రాధేకృష్ణ

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

చివ్వెంల, న్యూస్‌టుడే: నేటి బాలలే రేపటి పౌరులు అనే నానుడిని నిజం చేస్తూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. మండలంలోని బండమీది చందుపట్లలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ సహకారంతో రాత పుస్తకాలు, బ్యాగులు, జాతీయ నాయకుల చిత్రపటాలతో పాటు తదితర వస్తువులను శుక్రవారం అందించి మాట్లాడారు. కస్తూరి ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, మహేష్, తెలంగాణ యువజన సంఘం మండలాధ్యక్షుడు చెరుకు నగేష్, గౌరవ సలహాదారు గుద్దేటి చినవెంకన్న, భూక్యా వెంకన్న, కోడి రవి, గుద్దేటి మధుసూదన్, నాగరాజు, లక్ష్మణ్, ముక్కంటి, మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతో కుల గణన

తిరుమలగిరి, న్యూస్‌టుడే: బీసీల సమష్టి పోరాటాల ద్వారానే కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం జీవోనెంబర్ 18ని జారీ చేసిందని బీసీ సంక్షేమ సంఘం



తిరుమలగిరిలో సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘ నాయకులు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో జీవోనెంబర్ 18కి మద్దతుగా వివిధ కుల సంఘాలతో సమావేశమయ్యారు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే కులగణనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కులాల జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం, మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, జయచందర్, సురేందర్, సోమనారాయణ, రామ్మూర్తి, శోభన్, మధు పాల్గొన్నారు.

మందకొడిగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే

ముందుకు రాని దరఖాస్తుదారులు



మద్దిరాలలో ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

దస్తావేజులు అందుబాటులో ఉంచుకోవాలి

– అమీన్‌సింగ్, తహసిల్దార్, మద్దిరాల

గృహ నిర్మాణాలు చేపట్టే వారి స్థలానికి తప్పనిసరిగా ఎల్‌ఆర్‌ఎస్ ఉండాలి. లేకుంటే ఇల్లు నిర్మించుకునే సమయంలో ఇబ్బందులు తప్పవు. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరూ వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు అధికారులకు సహకరించాలి. సర్వే సమయంలో ప్లాట్ల యజమానులు సంబంధిత దస్తావేజులను అందుబాటులో ఉంచుకోవాలి. డిజిటల్ మ్యాపింగ్‌లో చూపిన చలానను లబ్ధిదారులు ప్రభుత్వానికి చెల్లించాలి.

ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న స్థలాలను క్రమబద్ధీకరించేందుకు తుంగతుర్తి నియోజకవర్గంలో రెవెన్యూ, చిన్న నీటిపారుదల, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలనూ పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో (జీపీఎస్‌తో) మ్యాపింగ్ చేసి సరిహద్దులను యాప్‌లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తులో పేర్కొన్న సర్వే నెంబరులో స్థల విస్తీర్ణాన్ని బట్టి యాప్‌లో వచ్చే చలానను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో 3180 దరఖాస్తులు రాగా దాదాపు 666 దరఖాస్తుల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో సర్వే మందకొడిగా సాగుతోందని చెబుతున్నారు.

– మద్దిరాల, తిరుమలగిరి, న్యూస్‌టుడే:

తుంగతుర్తి నియోజకవర్గంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు..

మండలం	దరఖాస్తుల సంఖ్య	పూర్తయిన సర్వే వివరాలు
తిరుమలగిరి	882	34
నూతనకల్	241	162
నాగారం	440	103
జాజిరెడ్డిగూడెం	349	78
తుంగతుర్తి	592	120
మద్దిరాల	676	169

భానుపురి, న్యూస్‌టుడే

? సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో పలు వీధిదీపాలు సరిగా వెలగటం లేదు. స్థానిక ప్రైవేటు ఆసుపత్రి పక్కవీధిలో రాత్రి అంధకారం నెలకొని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – సైదులు, జమ్మిగడ్డ

✔ పరిశీలించి వెలిగేలా చూస్తాం.

– తిరుమలేష్, పుర ఏఈ, సూర్యాపేట

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి చర్చికాంపౌండ్‌కు వెళ్లేమార్గం అధ్వానంగా మారింది. గుంతలుపడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూడ్చివేయాలి. –మధు, సూర్యాపేట

✔ పరిశీలించి మరమ్మతు చేపడతాం.

– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు స్థల పరిశీలన

నూతనకల్, న్యూస్‌టుడే: మండలంలో ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు జిల్లా అధికారుల ఆదేశించడంతో రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల, సర్వే శాఖల అధికారులు శుక్రవారం పాలేరు ఏటివెంట స్థల పరిశీలన చేపట్టారు. మండలంలోని తాళ్లసింగారం, గుండ్లసింగారం, మాచినపల్లి, బిక్కుమళ్ల గ్రామాల్లో స్థలాలను పరిశీలించినట్లు వారు తెలిపారు. ఏటిలో నీటిప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఇసుక నిల్వలు కనిపించడం లేదని వివరించారు. కార్యక్రమంలో నూతనకల్ ఆర్ఐ హసన్, సర్వేయర్ శైలజ, ఏఈ మహేంద్ర, మైనింగ్ ఆర్ఐ వసుమతి, జియాలజిస్ట్ సహాయకులు మహ్మద్ పాల్గొన్నారు.



గుండ్లసింగారం పాలేరు ఏటివద్ద ఇసుక నిల్వను పరిశీలిస్తున్న రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు

పొంచి ఉన్న ప్రమాదం



భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో పలుచోట్ల విద్యుత్తు ఎర్త్ తీగలు ప్రమాదకరంగా మారాయి. వాటి చుట్టూ ఎలాంటి రక్షణ కల్పించడం లేదు. రోడ్డ పక్కన స్తంభాలు, నియంత్రికలకు ఏర్పాటు చేసిన తీగలు తేలుతంతో ప్రమాదం పొంచి ఉంది. సూర్యాపేటలోని తాళ్లగడ్డలో రహదారి విస్తరణలో భాగంగా రోడ్డ పక్కన స్తంభాలు ఏర్పాటు చేశారు. భూమి లోతులో ఎర్త తీగలు ఉంచారు. వాటికి రక్షణగా దిమ్మెలు, కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యుదాఘాతం జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో కళాశాల విద్యార్థులు, పాదచారులు ఎక్కువగా వెళ్తుంటారు. వారికి తీగలు తేలిన విషయం తెలియకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. 'ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యను గుర్తించి రక్షణ వలయాలు ఏర్పాటు చేయిస్తామ'ని సూర్యాపేట పట్టణం-2 ఏఈ యశ్వంత్ తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు: ఎమ్మెల్యే



కుంటపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో మారుతి సత్య నారాయణరెడ్డి, ఎంఈవో వెంకటనారాయణ, ఏపీఎం మైసయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవిలమల్లు, నాయకులు వెంకన్న, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

చివ్వెంల: రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని డీసీఎం జి. రత్నయ్య అన్నారు. మండలంలోని అక్కల దేవిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఏపీఎం సైదయ్య, ఏవో వెంకటేశ్వర్లు, సీసీ ఉపేందర్, వీవోఏ ఝాన్సీ, మాజీ సర్పంచి గురువేందర్, సంఘబంధం అధ్యక్షురాలు సైదమ్మ, కార్యదర్శి మాస్రు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు పంపిణీ చేయాలని ధర్నా



నూతనకల్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మల్లు నాగార్జునరెడ్డి, తదితరులు

నూతనకల్, న్యూస్‌టుడే: చిల్లకుంట్లలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు శుక్రవారం నూతనకల్ తహసీల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన అర్హులతో దరఖాస్తు చేయించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, తిరుమలేష్, వెంకన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

రహదారిపై కుక్కలు.. పాదచారులకు తిప్పలు



భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేటలోని నూతన కలెక్టరేట్ రోడ్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఉదయం 5 గంటల నుంచే రోడ్డుపై గుంపులుగా తిరుగుతుండటంతో పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పుర అధికారులు శునకాల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం, సాయంత్రం స్వైరవిహారం చేస్తుండటంతో పాదచారులతోపాటు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'సిబ్బందితో కుక్కలు పట్టించి సంరక్షణ కేంద్రానికి తరలిస్తామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ చెప్పారు.

కూలిపోయే దశలో అంగన్‌వాడీ భవనం



ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని బోరింగ్‌తండాలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కూలిపోయే దశలో ఉన్న ఈ భవనాన్ని విడిచి చాలా ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అద్దెకిచ్చిన వారు కొద్ది నెలల్లోనే సెంటర్‌ను ఖాళీ చేయిస్తుండటంతో టీచర్, ఆయా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు. 'నూతన భవనం మంజూరు కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తామ'ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ తెలిపారు.

సైన్స్ ల్యాబ్‌లో చోరీ

☛ కొన్ని ప్రయోగ పరికరాలు ధ్వంసం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని చీదెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. గుర్తు తెలియని దుండగులు రాత్రివేళ సైన్స్ ల్యాబ్‌లోకి ప్రవేశించి ప్రయోగ పరికరాలను ధ్వంసం చేయడంతో పాటు స్టెతస్కోప్, కాంపౌండ్ మైక్రోస్కోప్, త్రీడీ మోడల్ ఓల్టామీటరు తదితర పరికరాలను ఎత్తుకెళ్లారని ప్రధానోపాధ్యాయుడు శంభులింగం చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు.



చీదెళ్ల జడ్పీఉన్నత పాఠశాల సైన్స్‌ల్యాబ్‌లో ధ్వంసం చేసిన పరికరాలు

'మంత్రిని విమర్శించే స్థాయి లేదు'

నాగారం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిక్కి శ్రీను అన్నారు. నాగారం(బంగ్లా)లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు కడారి సోమయ్య, చిప్పలపల్లి ఉపేందర్, కొమ్ము యాకస్వామి, కడియం శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం సరికాదు'

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీఎస్సీ నియామకాలు చేపట్టడం సరైన నిర్ణయం కాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పడిదల రవి కుమార్ మాదిగ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం హేయనీమన్నారు. కార్యక్రమంలో కనుకు జానయ్య మాదిగ, కస్తాల సైదులు, పెద్దపంగ కాటయ్య పాల్గొన్నారు.



మురుగునీటి శుద్ధి విధానాన్ని పరిశీలిస్తున్న మధిర, వైరా కమిషనర్లు సంపత్, చింతా వేణు, తదితరులు

సందర్శించి.. అధ్యయనం చేసి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలికను పురపాలక శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర, వైరా, సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల తిరుమలగిరి పుర కమిషనర్లు, అధికారులు సందర్శించారు. సూర్యాపేటలోని జమ్మిగడ్డలో సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటును సందర్శించి మురుగు నీటి శుద్ధి విధానాన్ని పరిశీలించారు. అనంతరం బాలెంల, జమునానగర్‌లోని డంపింగ్ యార్డులో సెగ్రిగేషన్ చేసే విధానాన్ని పరిశీలించారు. జమునానగర్‌లో సేంద్రియ ఎరువుల తయారీ ఉత్పత్తి విధానాన్ని తిలకించి అభినందించారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మధిర, వైరా కమిషనర్లు సంతప్, చింతా వేణు, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కమిషనర్లు పాల్గొన్నారు.

క్రైస్తవ పుస్తక ప్రదర్శన

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: క్రైస్తవులు దేవుడి చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరముందని రెవరెండ్ డాక్టర్ ఎం. ప్రభుదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో లెమేన్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దేవుడు, భక్తుల చరిత్ర పుస్తక ప్రదర్శనను సీహెచ్. సల్మాన్ రాజ్, రెవరెండ్ డా. పి. జాన్‌మార్క్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 25 నుంచి 29 వరకు పుస్తక ప్రదర్శన కొనసాగుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	2889	1806
జైశ్రీరాం	3216	1756
ఐఆర్-64	1964	1770
హెచ్‌ఎంటీ	2569	1606
కందుల	8393	4895
పెసర	6543	5368
వేరుసెనగ	6609	3359
మినుములు	4618	4618

స్నేహితుల వితరణ

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి సుశీల ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుమారుడు గుమ్మడి శేఖర్ చిన్ననాటి స్నేహితులు దశదిన కర్మ ఖర్చుల కోసం రూ.16 వేల విలువ గల సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. తునికి అజయ్‌కుమార్, శ్రీను, రమేష్, లింగయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆరు దశాబ్దాల అనుబంధం.. సైకిల్‌పై ప్రయాణం



యాభై ఏళ్ల కింద సైకిల్ ఉందంటే అదో గౌరవంగా భావించేవారు. అప్పట్లో ఊరికి ఐదారు ఉండటమే గగనం. రానురాను ఇంటికొకటి వచ్చింది. నేడు ద్విచక్ర వాహనాలు ఇంటికొకటి కాదు రెండు, మూడూ ఉంటున్నాయి. మారుతున్న కాలాను గుణంగా కార్ల సంఖ్య బాగానే పెరిగింది. చిన్న పిల్లలు సైకిళ్లు బాగానే వాడుతున్నారు. యువకులు, పెద్ద వాళ్లు కొద్దిమంది మాత్రమే వ్యాయామంలో భాగంగా సైక్లింగ్ చేస్తున్నారు. అర్వపల్లి గ్రామానికి చెందిన పండగ మల్లయ్య మాత్రం ఆరు దశాబ్దాలుగా సైకిల్ తొక్కుతున్నారు. 15 ఏళ్ల వయసులో తొక్కడం నేర్చుకున్న ఆయన అప్పట్లో ఇతర గ్రామాలకు కిరాయికి సైకిల్ తీసుకుని వెళ్లేవారు. గంటకో రూపాయి అద్దె ఉండేది. 17 ఏళ్ల వయసులో సొంతంగా సైకిల్ కొనుక్కున్న ఆయన ఎక్కడికైనా దానిపైనే వెళ్లేవారు. మార్గమధ్యలో టైరు పంక్చరయితే ఇబ్బందులు పడకుండా వెంట పంపు, రబ్బరు, సొల్యూషన్ తీసుకెళ్లేవారు. 'ప్రస్తుతం తన వయస్సు 75 సంవత్సరాలని, చిన్నప్పటి నుంచి సైకిల్‌పైనే ప్రయాణం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్నాన'ని మల్లయ్య తెలిపారు. ఉదయమే సైకిల్‌పై ఇంటింటికీ తిరిగి పాలు విక్రయిస్తున్నానని, చుట్టుపక్కల గ్రామాలకు ఇప్పటికీ దానిపైనే వెళ్తున్నానని చెప్పారు.

– జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే:

వైద్యం వికటించి బాలిక మృతి

తుంగతుర్తి, న్యూస్‌టుడే: వైద్యం వికటించి బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని ఏనెకుంట తండాలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ శ్రీను, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. చిన్న కుమార్తె జ్యోత్స్న గతేడాది ఇంట్లో జరిగిన గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో తాతతో పాటు గాయాలపాలై మరణించారు. పెద్ద కుమార్తె ఐశ్వర్య(15) రావులపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. నాలుగు రోజులుగా జ్వరం వస్తుండటంతో వరంగల్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం జ్వరం తీవ్రత పెరగటంతో మళ్లీ వైద్యం కోసం అతని దగ్గరికే తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగానే పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం తొర్రూరులోని మరో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మరణించింది. కుటుంబ సభ్యులు తొర్రూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని అక్కడి శవాగారంలోనే ఉంచారు. బాలిక మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మొండి బకాయిలు రూ.1.52 కోట్లు

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలికలో పాత పన్నులు పేరుకుపోయాయి. ఐదారేళ్ల నుంచి వసూలు కావడం లేదు. ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుండటంతో క్షేత్రస్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సూర్యాపేట పట్టణంలో 48 వార్డులు, 38 వేలపై చిలుకు నివాస గృహాలు ఉన్నాయి. వ్యాపార, గృహ, తదితర రూపంలో పురపాలికకు పన్నులు వస్తాయి. కొన్నేళ్లుగా 1833 గృహాల వారు మాత్రం పన్నులు చెల్లించకపోవడంతో రూ.1.52 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని పుర అధికారులు చెబుతున్నారు. ఏటా లక్ష్యం రూ.16.20 కోట్లు కాగా. . ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.7.53 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేసిన స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. 'పన్నుదారులు పుర కార్యాలయం, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు పుర కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఓపెన్ హౌస్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పోలీసుల విధి, విధానాలను వివరించారు.



సూర్యాపేటలో ఆయుధాలను చేతుల్లోకి తీసుకొని పరిశీలిస్తున్న విద్యార్థినులు, చిత్రంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, తదితరులు

ఆయుధ ప్రదర్శన చేసి, వాటి వినియోగాన్ని వివరించారు. కేసుల దర్యాప్తులో క్లూస్ టీం, వేలిముద్రల సేకరణ నిపుణులు, పోలీసు శునకాల విధులు, బాంబ్ స్క్వాడ్ విధి నిర్వహణను వివరించారు. మహిళల రక్షణలో షీటీం ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పోలీసు ఆయుధాలను చేతుల్లోకి తీసుకొని మురిసిపోయారు. జిల్లా అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహచారి, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ఐ నారాయణ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు జననం



మండలంలోని నాగులపహాడ్ ఆవాసం దుబ్బగూడెం గ్రామానికి చెందిన రైతు ఎదుల్ల రాంరెడ్డి పాడి గేదె శుక్రవారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. మగ, ఆడ దూడలు జన్మించడంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– పెన్‌పహాడ్, న్యూస్‌టుడే:

శుద్ధ జలం నేలపాలు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: నల్లాలకు బిరడాలు లేకపోవడంతో విలువయిన తాగునీరంతా వృథాగా పోతోంది. ఆత్మకూర్(ఎస్) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన ట్యాంకుకు నీటి సరఫరా జరుగుతున్నంత సేపు నల్లా నుంచి నీరంతా నేలపాలవుతోంది.

☛ ఇదే మండలంలోని ఏనుబాముల గ్రామ శివారులో బాటసారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నల్లాకు మూత లేదు. మోటార్లు నడుస్తున్నంత సేపు నల్లా ద్వారా నీరంతా వృథాగా పోతోంది. చిన్న, చిన్న మరమ్మతులు చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చని, సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 'స్థానిక అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి తక్షణమే పరిష్కరిస్తామ'ని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఏఈ రవికుమార్ తెలిపారు.



ఆత్మకూర్(ఎస్) ప్రాథమిక పాఠశాల నీటిట్యాంకు కుళాయి ద్వారా వృథాగా పోతున్న తాగునీరు



ఏనుబాముల ఊరి శివారులో నల్లా నుంచి

నూతన కార్యవర్గం

తిరుమలగిరి, న్యూస్‌టుడే: మాల మహానాడు నూతన కార్యవర్గం గుండెపురి గ్రామంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా బలిక నగేశ్, ఉపాధ్యక్షులుగా గుండ్ల అశోక్, మెడిద శ్రీకాంత్, ప్రధానకార్యదర్శిగా మేడే శాంతయ్య, కార్యదర్శిగా గుండ్ల భాగ్యయ్య, కోశాధికారిగా బలిక రమేశ్, గౌరవ సలహాదారుడిగా మెడిద శ్రీను ఎన్నికయినట్లు మండల అధ్యక్షుడు గంట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గంట సందీప్ ప్రకటించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

నాగారం, న్యూస్‌టుడే: వర్ధమానుకోట పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఉప కేంద్రం వైద్యుడు డాక్టర్ యుగేందర్, ప్రధానోపాధ్యాయిని ఆనంద, ఉపాధ్యాయులు మల్లయ్య, అనిత పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నాగారం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సూర్యాపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఐలయ్య తెలిపారు. మండల ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.